

గాలివాన బీభత్సం

అకాల వర్షం రైతులను ఆగం చేసింది. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి.

- 8లో ▸



అర్జీలను పెండింగ్‌లో..

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
42.3 /21.7

వాతావరణం

ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం కాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పాకిస్తాన్ పౌరులను పంపించేయాలి



సుభాష్‌నగర్/ఖలీల్‌వాడి: పాకిస్తాన్ పౌరులు జిల్లాలో ఉంటే వారిని వెనక్కి పంపించేయాలని, కేంద్ర ప్రభుత్వ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. చెల్లుబాటుకాని వీసాలతో జిల్లాలో అ క్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ పౌరులను గుర్తించి బహిష్కరించాలని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్న వ్యక్తులు నిజామాబాద్‌లో పట్టుబడిన సందర్భాలను సీపీకి గుర్తు చేశామన్నారు. అనుమానిత ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చే యాలని, నగర అంతర్గత శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసు కోవాలని కోరామన్నారు. వారి వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

యూడీఐడీతో స్లాట్‌బుక్ చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: దివ్యాంగులు ఇక నుంచి మీ సేవ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్లకు వెళ్లకుండానే యూడీఐడీ(యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ) వెబ్ సైట్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చని డీఆర్డీవో సాయాగౌడ్ తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన యూడీఐడీ వెబ్‌సైట్‌పై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో దివ్యాంగులకు సోమవారం అవగాహన కల్పించారు. యూడీఐడీలో ప్రవేశపెట్టిన 21 రకాల డిసెబిలిటీలను వివరించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. సదరంను తొలగించడం జరిగిందన్నారు. సదరంలో పాత సర్టిఫికెట్ కాలం ముగిసిన వారు యూడీఐడీ ద్వారా రెన్యువల్ చేసుకోవచ్చని సూచించారు. స్లాట్‌బుక్ అ యిన తరువాత క్యాంప్ తేదీ, స్థలం వివరాలతో రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు మెసేజ్ వస్తుందని తెలిపారు. సమావేశంలో డీపీఎం రాచయ్య, ఏపీఎం ఉమాకిరణ్, ఏవో రాజు, మీసేవ మేనేజర్ కార్తీక్ పాల్గొన్నారు.

డైట్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

నిజామాబాద్ అర్బన్: డైట్‌లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌లో రెండు సంవత్సరాల కోర్సులకు సంబంధించి ప్రవేశాలు ఉంటాయని, ఈనెల 15వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే 17, 18 తేదీల్లో సరిచేసుకోవాలని పేర్కొన్నారు. 20వ తేదీన ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్లు జారీ చేయడం జరుగుతుందని, 25వ తేదీన ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. జూన్ 5న ఫలితాలు వెలువడుతాయని, ఎంపికైన విద్యార్థులు జూన్ 7 నుంచి 11వ తేదీ వరకు సంబంధిత డైట్ కళాశాలల్లో ఒరిజినల్ సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్‌కు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.



యూనిట్లు ఏర్పాటయ్యేనా ?

లక్కంపల్లి సెజ్‌కు 2009లో వైఎస్ఆర్ హయాంలో రూపకల్పన చేశారు. 2017లో యూనిట్లు ఏర్పాటు చేసేందుకు పతంజలి సంస్థ, మరికొందరు పెట్టుబడి దారులు ముందుకు వచ్చారు. అయితే అప్పటి ప్రజాప్రతినిధి పర్సంటేజీల గొడవతో వారు వెనక్కి వెళ్లినట్లు తెలిసింది. కాగా, ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపి సెజ్‌లో యూనిట్లు ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయంటున్నారు.

- 2009లో రూపకల్పన.. 429 ఎకరాల కేటాయింపు
- ఇప్పటివరకు యూనిట్లు నెలకొల్పని పరిస్థితి
- వ్యవసాయ అనుబంధ యూనిట్లు ఏర్పాటు చేయాలంటున్న ఔత్సాహికులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జిల్లాలోని నందిపేట మండలం లక్కంపల్లి వద్ద సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి) ఏర్పాటు చేశారు.

వ్యవసాయ రంగంలో ముందంజలో ఉన్న జిల్లాలో పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి అంతర్జాతీయ ఎగుమతులను ప్రోత్సహించే లక్ష్యంతో 2009లో వైఎస్ఆర్ దీనికి రూపకల్పన చేశారు. వ్యవసాయ అనుబంధ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి స్థానికంగా ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు గాను రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా 429 ఎకరాలు కేటాయించారు. వైఎస్ఆర్ మరణం తరువాత అప్పటి మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి దీని కోసం రూ.50 కోట్లు కేంద్రం నుంచి మంజూరు చేయించారు. అప్పటి కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్‌పవార్ సహకారంతో ఈ నిధులు తీసుకొచ్చారు. ప్రహరీతోపాటు రోడ్లు నిర్మించారు. స్మార్ట్ ఆగ్రో కర్క్యుమిన్ యూనిట్‌తో పాటు కొన్ని గోదాములు నెలకొల్పారు. అయితే తెలంగాణ ఏర్పాటు తరువాత గత పదకొండేళ్లలో ఈ సెజ్‌లోకి ఒక్క యూనిట్ రాకపోవడం గమనార్హం. దేశంలోనే పేరెన్నిక గన్న పతంజలి సంస్థ 2017లో ఇందులో యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు రాగా అప్పటి స్థానిక ఎమ్మెల్యే పర్సంటేజీలు అడగడంతో వెనక్కు వెళ్లినట్లు తెలిసింది. ఇదేవిధంగా మరికొందరు పెట్టుబడిదారులు సైతం వెనక్కు వెళ్లిపోయారు. దీంతో సదరు అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇదే అవకాశంగా భావించి 200 ఎకరాల కబ్జాకు రంగం సిద్ధం చేశాడని ఆరోపణలు మిన్నంటాయి. ఈ క్రమంలో ఇందులో ఉన్న గుట్టను సైతం టీఎస్ఐఐసీ నిబంధనలకు విరుద్ధంగా తవ్వించి తన అనుచరుల ద్వారా మొరం అమ్మించాడని విమర్శలు సైతం వచ్చాయి.

200 ఎకరాల్లో కేసీఆర్ టౌన్‌షిప్ పేరిట 5,058 ప్లాట్లకు లేఅవుట్..

రెండు వందల ఎకరాల సెజ్ భూములను కబ్జా చేసి అందులో 5,058 ప్లాట్లు వేసేలా లేఅవుట్ ప్లాన్ తయారు చేయడం గమనార్హం. ఇందులో బ్లాక్‌–1లో 2,715 ప్లాట్లు, బ్లాక్‌–2లో 2,343 ప్లాట్లు ఉండేలా వెంచర్ ప్లాన్ రూపొందించడం ప్రత్యేకం. ఈ అక్రమ వ్యవహారాలపై ప్రశ్నించిన వ్యక్తులపై అక్రమంగా అప్పటి ఎమ్మెల్యే కేసులు పెట్టించాడని చెబుతారు. ఒక వ్యక్తిపై అట్రాసిటీ, మరో నలుగురిపై ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించినట్లు అక్రమంగా కేసులు నమోదు చేయించడం విశేషం. సెజ్ భూముల్లో అక్రమంగా లేఅవుట్ చేసేందుకు సహకరించిన అప్పటి పంచాయతీ కార్యదర్శి రమేశ్ ద్వారా ప్రశ్నించిన నలుగురు వ్యక్తులపై విధులకు ఆటంకపరిచారనే నెపంతో అక్రమంగా కేసులు పెట్టడం గమనార్హం. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని స్ట్రీమ్‌లైన్ చేసి వ్యవసాయ అనుబంధ యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఔత్సాహికులు కోరుతున్నారు.



లక్కంపల్లి స్మార్ట్ ఆగ్రో ఫుడ్ పార్క్ లోని గోదాములు

భూ సమస్యలు లేని పల్లెలుగా తీర్చిదిద్దుకోవాలి



చాకిర్యాలలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



కొడిచర్లలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

- భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే భూ భారతి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- పైలట్ మండలం మెండోరాలో రెవెన్యూ సదస్సులు ప్రారంభం

బాల్కొండ: భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకుని గ్రామాలను భూ సమస్యలు లేని పల్లెలుగా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. భూ భారతి అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలన్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్‌గా అమలవుతున్న మెండోరా మండలం చాకిర్యాల, కొడిచర్ల గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కలెక్టర్ హనుమంతు ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకున్నారు. భూ భారతిపై అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు మెండోరా మండలాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డుల తప్పులు, విస్తీర్ణంలో హెచ్చు, తగ్గులు, వారసత్వ భూములు, సర్వే నంబర్‌ల మిస్సింగ్, పట్టా పాస్ పుస్తకాలు లేక పోవడం , ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్ –బీ కింద చేర్చిన భూముల తదితర దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించాలని తహసీల్దార్లకు సూచించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్‌డెస్క్, జనరల్ డెస్క్‌లను పనితీరును కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజు, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, సొసైటీ సహకార సంఘం చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్‌ల నిర్మాణానికి ఆసిఫాబాద్ నుంచి శంకుస్థాపన

- రూ.80 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- ఫలించిన ఎంపీ అర్వింద్ కృషి

సుభాష్‌నగర్: జిల్లాలోని డిచ్‌పల్లి సీఎంసీ వద్ద, ముప్కాల్ చౌరస్తాలో అండర్ పాస్‌ల నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం ఆసిఫాబాద్ నుంచి శంకుస్థాపన చేశారు. నేషనల్ హైవే 44పై అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను (బ్లాక్ స్పాట్‌లు) గతంలో గుర్తించిన అధికారులు.. డిచ్‌పల్లి సీఎంసీ వద్ద రూ.38 కోట్లతో, ముప్కాల్ చౌరస్తాలో రూ.42 కోట్ల వ్యయంతో అండర్ పాస్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ఏడాదిన్నర క్రితం కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని ఎంపీ అర్వింద్ ధర్మపురి ప్రత్యేకంగా కలిసి అండర్‌పాస్‌ల నిర్మాణం ఆవశ్యకతపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నిధులు మంజూరు చేసి సోమవారం శంకుస్థాపన చేశారు. జిల్లాలో ఇప్పటికే గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్‌వోబీలు మంజూరు చేయించగా, పనులు వేగవంతంగా సాగుతున్నాయి. పలు ఆర్‌వోబీల పనులు పూర్తయ్యాయి. తాజాగా అండర్ పాస్‌ల నిర్మాణానికి ఎంపీ అర్వింద్ ధర్మపురి కృషితో రూ.80 కోట్లు మంజూరు కావడం, మంత్రి గడ్కరీ పనులకు శంకుస్థాపన చేయడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు కలేనా?



జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు కోసం ప్రతిపాదించిన స్థలం

జక్రాన్‌పల్లి: జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కలగానే మిగిలిపోయేలా ఉంది. దీనికి కేంద్ర కమిటీ సభ్యులు ఇచ్చిన నివేదిక బలాన్ని చేకూరుస్తోంది. జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్, జక్రాన్‌పల్లి, కొలిప్యాక్, తొర్లికొండ, అర్గుల్ గ్రామాల పరిధిలో సుమారు 1663 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను ప్రభుత్వం ఎయిర్‌పోర్టు స్థాపనం కోసం సిద్ధం చేసింది. జిల్లాకు 2009లో వచ్చిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు స్థాపిస్తామని హామీ ఇచ్చారు. అప్పటి నుంచి పలు దఫాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సర్వేలు నిర్వహించాయి. ప్రతిపాదిత స్థలాన్ని విమానాశ్రయానికి అనుకూలంగా సిద్ధం చేసి ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఇటీవల పర్యటించిన ఎయిర్‌పోర్టు అథారిటీ కమిటీ సభ్యులు తేల్చి చెప్పారు. ఎయిర్‌పోర్టు స్థాపనపై రాష్ట్ర ప్రభుత్వంతో పునఃసమీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. దానికనుగుణంగా కేంద్ర వైమానిక శాఖ ఎస్ శ్రీనివాసరావు, మల్లికా జయరాజ్, శైలేశ్ దఖానేతో కూడిన బృందాన్ని కమిటీ సభ్యులుగా ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులు ఈ ఏడాది ఏప్రిల్ 23 నుంచి 25 వరకు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ కమిటీ రిపోర్టు ప్రకారం విమానాశ్రయ స్థలంలో మసీదు, నీటి వనరులు, విద్యుత్ స్తంభాలు, కొన్ని నివాస ప్రాంతాలు, కొండ శిఖర వ్యాసార్ధంలో అడ్డంకులు ఉన్నాయని తేల్చింది. ఈ అంశాలను టెక్నో ఎకనామిక్ వయబిలిటీ రిపోర్టులో సైతం ప్రస్తావించామని తెలిపింది. అందులో పేర్కొన్న విధంగా భారత వైమానిక దళస్థలం, భూసేకరణ, భౌతిక అడ్డంకులకు సంబంధించిన సమస్యలు ఇంకా అలాగే ఉన్నాయని నివేదిక అందజేసింది. కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి అడ్డంకులు లేని భూమిని ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కమిటీ తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం పంపాల్సిన రిపోర్టులను పంపకుండా, అనువైన భూములను ఎంపిక చేసి ఇవ్వకుండా తాత్సారం చేస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఈజిప్టుకు ఇందూరు పసుపు

- రైతులు ఏర్పాటు చేసుకున్న పరిశ్రమ జిల్లాకే తలమానికం
- ఎంపీ ధర్మపురి అర్వింద్
- మనోహరాబాద్‌లో పసుపు పరిశ్రమ ప్రారంభం



వివిధ రకాల పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, కార్యదర్శి భవానీశ్రీ, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి తదితరులు

జక్రాన్‌పల్లి: పసుపును 'ఇందూరు పసుపు' బ్రాండ్ పేరుతో ఈజిప్ట్ దేశానికి ఎగుమతి చేస్తామని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మండలంలోని మనోహరాబాద్‌లో పసుపు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందూరు పసుపు తయారీ పరిశ్రమను ఎంపీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న పుసుపు పరిశ్రమ జిల్లాకే తలమానికమని అన్నారు. రైతులే స్వయంగా పసుపు ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ పరిశ్రమలో పసుపు ఆయిల్ సైతం తీయనున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీవోల కోసం కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే భారీగా రాయితీలు అందజేస్తుందని తెలిపారు. ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, కార్యదర్శి భవానీశ్రీ, భూదాత హిమగిరిరావు, పసుపు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, సంతోష్ రెడ్డి, పుప్పాల నగేశ్, వెల్మ సంతోష్‌రెడ్డి, భోజన్న, గంగారెడ్డి, శ్రీను, రాజ్‌లక్‌పతిరెడ్డి, సురేశ్, రైతులు పాల్గొన్నారు.

బోధన్‌లో పాకిస్తానీలు..

హిందూ రాష్ట్ర ఏర్పాటు పునాది ఇందూరు గడ్డ అని, ఇక్కడి నుంచే హిందూ రాజ్యస్థాపన ప్రారంభమవుతుందని అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బోధన్‌లో ఒకే ఇంటి నంబర్‌పై 42 పాస్‌పోర్టులు జారీ అయ్యాయన్నారు. బోధన్‌లో పాకిస్తానీలతోపాటు బంగ్లాదేశీలు ఉన్నారని ఆరోపించారు. తక్షణమే వారిని వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు. పాకిస్తానీలు వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశించినప్పటికీ కాంగ్రెస్ పాలిత ప్రాంతాల నుంచి వెళ్లిపోవడం లేదన్నారు. కేంద్రం ఉగ్రవాదులకు త్వరలో గట్టి జవాబిస్తుందన్నారు.

జిల్లాలో స్వల్ప భూ ప్రకంపనలు!



సిరికొండ/మోర్తాడ్ : జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం స్వల్పంగా భూమి కంపించిందని ప్రజలు తెలిపారు. సిరికొండ మండల కేంద్రంతోపాటు మైలారం, నర్సింగ్‌పల్లి , చీమన్‌పల్లి, చిన్నవాల్గోట్, రావుట్ల, కుర్దుల్‌పేట్, హుస్సేన్‌నగర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, మెండోరా మండల కేంద్రాల్లో స్వల్పంగా భూమి కంపించినట్లు తెలిపారు. భయాందోళనతో ఇళ్లలో నుంచి బయటికి వచ్చామని పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం భీమ్‌గల్, మెండోరా మండలాల్లో భూమి కంపించిన విషయం తెలిసిందే.

కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి అర్బన్/మాచారెడ్డి: కామారెడ్డి పట్టణంతోపాటు మాచారెడ్డి మండలం సోమారంపేటలో భూ కంపించిందని ప్రజలు తెలిపారు. భూమిలో నుంచి పెద్దగా శబ్దాలు రావడంతో భయంతో ఇళ్లలో నుంచి బయటికి పరుగులు తీశామన్నారు.

నెలాఖరు వరకు సెర్ప్ బదిలీలు

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం.. జీవో జారీ
- త్వరలో గైడ్‌లైన్స్ విడుదల
- జిల్లాలో 215మంది ఉద్యోగులు



డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉద్యోగులందరికీ (వంద శాతం) బదిలీలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జీవో నం.250 జారీ చేయడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అన్ని కేడర్‌లు కలిపి మొ త్తం 215 మంది పని చేస్తున్నారు. ఇందులో ఏపీడీ, డీపీఎం, సీసీలు, అడ్మిన్ అసిస్టెంట్లు, అ టెండర్లు, డ్రైవర్లు ఉన్నారు. సెర్ప్‌లో బదిలీలు లేక దాదాపు పదేళ్లు అవుతోంది. అప్పటి నుంచి ఉద్యోగులు ఒకే ప్రాంతం, ఒకే సీటులో పని చేస్తున్నారు. దీంతో కొంతమందికి అవినీతి చేసేందుకు అవకాశం ఏర్పడింది. ప్రాంతంపై పట్టు సాధించి ఎవరికీ చిక్కకుండా తెలివిగా అవినీతికి పాల్పడుతున్నారు. అలాంటి ఉద్యోగులకు తాము విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతా న్ని వదిలి వెళ్లేందుకు మనసు ఒప్పడం లేదు. మరికొంత మందికి ఒకే చోట పని చేయడం, దూర ప్రాంతాల్లో విధులకు వెళ్లి రావడం ఇబ్బందికరంగా మారింది. అలాంటి వారు బదిలీలు ఎప్పుడొస్తాయా అని ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు.

సీనియారిటీ జాబితా..

ఉద్యోగుల బదిలీలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సెర్ప్ రాష్ట్ర శాఖ భావిస్తోంది. ఇందుకు విధివిధానాలను కూడా రూపొందించడంతోపాటు ఉద్యోగుల సీనియారిటీ జాబితాను రెడీ చేస్తోంది. నూరుశాతం బదిలీలు చేపట్టనుండడంతో ఉద్యోగులందరూ బదిలీ కానున్నారు. ఏపీడీ, డీపీఎంలకు రాష్ట్ర స్థాయిలో, ఏపీఎంలకు జోనల్ స్థాయిలో, సీసీలు, ఇతర సిబ్బందికి జిల్లా స్థాయిలో బదిలీలు చేయనున్నారు. అయితే బదిలీలను ఏ విధంగా చేయాలనేదానిపై సెర్ప్ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఏ విధంగా చేస్తారనే దానిపై ఈ వారంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బదిలీల నేపథ్యంలో కొంతమంది ఉద్యోగులకు కోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యేందుకు ఇప్పటి నుంచే పైరవీలు మొదలుపెట్టారు. ఉద్యోగ సంఘ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

గైడ్‌లైన్స్ రావాలి



సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. వారంలో గైడ్‌లైన్స్ వచ్చే అవకాశాలున్నాయి. గైడ్‌లైన్స్ ప్రకారం నెలాఖరు నాటికి బదిలీలు పూర్తి చేస్తారని తెలుస్తోంది. బదిలీలు పారదర్శకంగా జరుగుతాయి.

– సాయాగౌడ్, డీఆర్‌డీవో

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థినులు



డిచ్‌పల్లి: డాక్టర్‌ ఏపీజే అబ్దుల్‌ కలాం సైన్స్‌ ల్యాబ్‌, డ్రీం ఫోర్స్‌ ఫౌండేషన్‌, మహబూబ్‌ నగర్‌ జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 12 రోజులపాటు నిర్వహించిన సైన్స్‌ వేసవి శిబిరంలో జిల్లా విద్యార్థినులు ప్రతిభచాటారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 114 మంది విద్యార్థులు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. నిజామాబాద్‌ జిల్లా డిచ్‌పల్లి మండలం రాంపూర్‌ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు శ్రీహిత, రుత్విక పాల్గొని ప్రతిభచాటగా ప్రశంసాపత్రంతోపాటు 'ఒక విజేత ఆత్మకథ' పుస్తకాన్ని బహుమతిగా అందుకున్నారు. సైన్స్‌ జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అందించేందుకు ఈ వేసవి శిక్షణ శిబిరం ఎంతగానో దోహదపడినట్లు పాఠశాల అటల్‌టింకరింగ్‌ ల్యాబ్‌ ఇన్‌చార్జి శ్రీనివాస్‌ ఖత్రి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: మోడల్‌ విద్యా సంస్థల్లో ఇంటర్‌ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్‌ ఇంగ్లిష్‌ మీడియంలో ప్రవేశాలు పొందవచ్చని, ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ట్రాఫిక్‌ ఏసీపీ బదిలీ!

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణను బదిలీ చేస్తూ సోమవారం డీజీపీ ఆఫీసు నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు సమాచారం. నిజామాబాద్‌ నుంచి హైదరాబాద్‌లోని డీజీపీ ఆఫీస్‌కు అటాచ్‌ చేసినట్లు తెలిసింది.

బాలిక అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన నిధారాణి (15) అనే బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ సోమవారం తెలిపారు. ఏప్రిల్‌ 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన నిధారాణి ఆచూకీ కోసం బంధువుల ఇళ్లు, ఇతర చోట్ల వెతికినా లభించలేదని, తల్లి దేవావత్‌ భాను ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేశామన్నారు.

గాలివాన బీభత్సం

- ధాన్యం కాపాడుకునేందుకు కల్లాలకు పరుగులు తీసిన రైతులు
- పలుచోట్ల నేలవాలిన నువ్వు, మామిడి



డొంకేశ్వర్‌ మండలం చిన్నయానంలో నేలవాలిన నువ్వు పంట



ముప్కాల్‌ మండలం రెంజర్లలో నేలకొరిగిన చెట్టు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): అకాల వర్షం రైతులను ఆగం చేసింది. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. జిల్లా వ్యాప్తంగా చాలా మండలాల్లో తీవ్రమైన ఈదురు గాలులతోపాటు వర్షం కురిసింది. పలు చోట్ల మామిడి కాయలు నేలరాలాయి. నువ్వు పంట పొలాల్లోనే నేలవాలింది. వడ్లు తడుస్తాయనే భయంతో రైతులు కల్లాలకు పరుగులు తీశారు. కల్లాల్లో ఉన్న ధాన్యం కుప్పలు, వడ్లు నింపిన బస్తాలపై వేసిన టార్పాలిన్లు గాలికి ఎగిరిపోకుండా రాత్రి వరకు రైతులు కల్లాల వద్దే ఉన్నారు. కోటగిరి, పోతంగల్‌, మోస్రా, చందూర్‌, వర్ని, బోధన్‌, నిజామాబాద్‌ రూరల్‌, నిజామాబాద్‌ నార్త్‌, డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, భీమ్‌గల్‌, సిరికొండ, ఆలూరు, ఆర్మూర్‌, డొంకేశ్వర్‌, బాల్కొండ, ముప్కాల్‌ మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది.

మెండోరాలో కంపించిన భూమి

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్‌, మెండోరా మండలాల పరిధిలో వాన దంచికొట్టింది. ఈదురు గాలులకు చెట్లు నేలకొరిగాయి. విద్యుత్‌ తీగలు తెగి పడ్డాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. మెండోరా మండల కేంద్రంలో 3 నుంచి 4 సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళన చెందారు.

ఉబ్బసంతో ఉక్కిరిబిక్కిరి

- జాగ్రత్తలు పాటిస్తే ఉపశమనం
- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం

వాతావరణంలోని అలర్జీ కలిగించే పదార్థాల కారణంగానో.. వంశపారంపర్యంగానో వచ్చే ఉబ్బసం(ఆస్తమా) వ్యాధి మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఊపిరి తీసుకోవడం కష్టతరమవుతోంది. దీంతో రోజూవారీ జీవితం ప్రభావితమవుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం లేనప్పటికీ.. సమర్థవంతమైన చికిత్స, మందుల వాడకంతో సంతృప్తికరంగా జీవించొచ్చని ప్రముఖ పల్మనాలజిస్టు రాజేంద్రప్రసాద్‌ తెలిపారు. నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– నిజామాబాద్‌ నాగారం

జిల్లాలో ఆస్తమా బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. ఆస్తమా వాయునాళాలకు సంబంధించిన వ్యాధి. నాళాలకు వాపు రావడంతో జిగురుగా ఉండే పదార్థం(శ్లేష్మం) తయారవుతుంది. దీంతో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడతాయి. దుమ్ము, పుష్పాల దూళి, గాలి కాలుష్యం, పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయనాలు, చల్లటి, పొడి గాలులు ఆస్తమా బారిన పడేందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కొంతమందిలో ఆస్తమా వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉంటుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు.

గుర్తించండి ఇలా..

సాధారణ పనులు, వ్యాయామం చేయడంలో ఇబ్బందులు ఏర్పడుతాయి. ఛాతి బిగపట్టినట్లు ఉంటుంది. విపరీతంగా దగ్గు వస్తుంది. నడిచినా, మెట్లెక్కినా త్వరగా అలసిపోతారు.

వ్యాధిగ్రస్తులకు జాగ్రత్తలు..

పొగ తాగడం మానేయాలి. ఇతరులు తాగితే దూరంగా ఉండాలి. దుమ్ము, ధూళి, చల్లని ప్రదేశాల్లో సంచరించొద్దు. పెంపుడు జంతువులకు దూరంగా ఉండాలి. విటమిన్‌ 'డి' సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.



ఏం తినాలి? ఏం తినొద్దు?

విటమిన్‌ 'ఏ' ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి.ప్రధానంగా క్యారెట్లు, పాలకూర, చిలగడదుంప, చేప, పాల ఉత్పత్తులు, గుడ్లు తినాలి. మాంసం, చీజ్‌, ఐస్‌క్రీమ్‌, పాలకొవ్వు వంటి సంతృప్త ఆమ్లాలను నివారించాలి. వీటితో వాపు పెరిగి ఇబ్బందులు కలుగుతాయి. కొబ్బరి నూనె, పామ్‌ఆయిల్‌తో చేసిన ఆహారంతో ఆస్తమా పెరిగే అవకాశం ఉంటుంది.

భయపడొద్దు..



ఆస్తమా అనేది దీర్ఘకాలిక వ్యాధి. భయపడాల్సిన అవసరం లేదు. వైద్యుల సలహాలు, సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహార నియమాలు పాటిస్తే వ్యాధిని తరిమికొట్టవచ్చు. వైద్యులు సూచించిన మందులతోపాటు ఇన్హేలర్‌ వాడాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. దుమ్ము, ధూళి, చల్లని ప్రదేశాల్లో తిరుగొద్దు.

– డాక్టర్‌ బొద్దుల రాజేంద్రప్రసాద్‌, ప్రముఖ పల్మనాలజిస్ట్‌

అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, అధికారులు

- అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌
- ప్రజావాణికి 117 ఫిర్యాదులు

నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 117 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్లతోపాటు జడ్పీ సీఈవో సాయాగౌడ్‌, నిజామాబాద్‌ ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు.

అందాల పోటీలు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యూ ప్రతినిధులు

హైదరాబాద్‌లో నిర్వహించే మిస్‌వరల్డ్‌ 72వ పోటీలను రద్దు చేయాలని పీవోడబ్ల్యూ, ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు ప్రజావాణిలో విన్నవించారు. అనంతరం కలెక్టరేట్‌ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. స్త్రీ ఆత్మగౌరవాన్ని భంగపరిచేలా ఉన్న ఈ పోటీలను నిర్వహించొద్దన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ కార్యదర్శి సంధ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, అరుణ్‌, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజు, అనిత, లక్ష్మి, సంజన, అమూల్య, మంజుల, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి అమలు కావడం లేదు

నాకు గృహజ్యోతి పథకం అమలు కావడం లేదు. ప్రతి నెలా 200 యూనిట్ల కంటే తక్కువగానే విద్యుత్‌ వినియోగిస్తున్నాను. గృహజ్యోతి కోసం అధికారులకు విన్నవించినా అధికారులు స్పందించడం లేదు.

– బాదావత్‌ గంగారాం, మద్దెపల్లి

ఉపాధి కల్పించండి..



నాకు ఎలాంటి ఆధారం లేదు. నా కొడుకు ఆరోగ్యం బాగోలేదు. నాకు ఏదైనా ఉపాధి కల్పించండి. ఇదివరకే అధికారులకు కలిసి విన్నవించాను. ఇప్పటికైనా నా ఉపాధి కల్పించండి.

– పిసారి శాలబాయ్‌, పుప్పలపల్లి

స్లాట్‌బుకింగ్‌ కావడం లేదు



సదరం సర్టిఫికెట్‌ కోసం వెళితే స్లాట్‌బుకింగ్‌ చేసుకోవాలని చెబుతున్నారు. గత కొన్ని నెలలుగా స్లాట్‌ బుకింగ్‌ కావడం లేదు. సదరం సర్టిఫికెట్‌ గడువు ముగిసింది. మళ్లీ పునరుద్ధరించాలి.

– రాజేశ్వర్‌, ధర్పల్లి

నా భూమిని చూపించండి



అభంగపట్నం గ్రామంలోని సర్వే నంబర్‌ 535లో ఒక ఎకరం భూమి ఉంది. ప్రస్తుతం ఈ భూమి నా పేరుమీద లేదంటూ అధికారులు చెబుతున్నారు. గతంలోనే నా పేరు మీద ఉన్నట్లు నా వద్ద పత్రాలు ఉన్నాయి. ధరణిలో 1బీ పహాణిలో భూమి ఉంది. కానీ, సర్వేయర్లు భూమి లేదంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు విన్నవించినా న్యాయం చేయడం లేదు. రెండేళ్లుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. – గొల్ల బీరయ్య, అభంగపట్నం

రేషన్‌కార్డులో పేర్లు నమోదు చేయండి



రేషన్‌కార్డులో నా కుమారులకు సంబంధించిన పేర్లు నమోదు కావడం లేదు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పరిష్కారం కావడం లేదు. అధికారులు ఇకనైనా స్పందించి పేర్లు నమోదు చేయగలరు.

– రజినీ, దుబ్బ, నిజామాబాద్‌

కాకతీయ విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



కాకతీయ విద్యార్థులను అభినందిస్తున్న బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌ అర్బన్‌: పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులు సాధించిన కాకతీయ ఒలంపియాడ్‌ విద్యార్థులను మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి సోమవారం తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు క్రితి, నితీష్‌, అఖిల్‌, కృతి, సాయి శ్రేయస్‌, వర్షిని, కౌశిక్‌ ప్రసాద్‌ ఎమ్మెల్యేను కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులు రావడం గర్వకారణం అన్నారు. జిల్లాలో పాఠశాల విద్యను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. 36 ఏళ్లుగా విద్య వ్యవస్థలో తనకంటూ ఒక ముద్ర వేసుకున్న కాకతీయ విద్యాసంస్థలు మరింత పేరుప్రతిష్ఠలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, కాకతీయ కళాశాల డైరెక్టర్‌ రజినీకాంత్‌, ప్రిన్సిపాల్‌ ఫరీదుద్దీన్‌, చంద్రశేఖర్‌, ఫణీంద్ర, మౌనిక, రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులు సాధించిన క్రితి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శ్రీ పద్మశాలి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిజామాబాద్‌ అర్బన్‌/ మోపాల్‌ : నగరంలోని వర్ని రోడ్‌ శ్రీ పద్మశాలి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పదో తరగతి 2005–2006 బ్యాచ్‌ విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానించారు. మోపాల్‌ మండలంలోని బాడ్సి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2009–10లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 15 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయంగా పలుకరించుకొని, తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటాపాటలతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు వీడియో కాల్స్‌ ద్వారా ఈ వేడుకలో పాల్గొన్నారు.



బాడ్సిలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఐక్యరాజ్యసమితికి ఎన్‌డీసీసీబీ కృతజ్ఞతలు



ఐక్యరాజ్యసమితికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎన్‌డీసీసీబీ పాలకవర్గం, బ్యాంకు అధికారులు

సుభాష్‌నగర్‌: ఐక్యరాజ్యసమితి 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేస్తూ ఎన్‌డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేశ్‌ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని ఉమ్మడి జిల్లా డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్‌ అధ్యక్షతన సోమవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలు సభ్యుల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఎన్‌డీసీసీబీకి పూర్వవైభవం తీసుకొచ్చే నిర్ణయాలు కఠినంగా అమలు చేస్తున్నామని, ఇందులో పాలకవర్గం, సభ్యులు, రైతుల సహకారం మరువలేనిదన్నారు. ప్రధానంగా బ్యాంకు ఎన్‌పీఏ తగ్గించేందుకు అందరి సహకారం కావాలని కోరారు. అనంతరం ఎన్‌డీసీసీబీ ప్రత్యేకంగా పాలకవర్గసభ్యులు, అధికారులు, సిబ్బందికి తయారు చేసిన టోపీలను అందజేశారు. సమావేశంలో వైస్‌ చైర్మన్‌ నల్ల చంద్రశేఖర్‌ రెడ్డి, డీసీవో శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు, బ్యాంకు సీఈవో నాగభూషణం వందే, నాబార్డు డీడీఎం, టీజీక్యాబ్‌, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

కారు, ఆటో ఢీ.. పలువురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన ఆటోడ్రైవర్‌ హుస్సేన్‌

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్‌ గేట్‌ వద్ద సోమవారం రాత్రి కారు, ఆటో ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్‌పూర్‌ గ్రామానికి చెందిన కార్గం మల్లేశ్‌ తన కుమారుడు తిరుపతితోపాటు ఏర్రారం గ్రామానికి చెందిన కాశీ జగ్జీవన్‌తో కలిసి కారులో గోపాల్‌పేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మెదక్‌ జిల్లా గోమారం గ్రామానికి చెందిన యండీ హుస్సేన్‌ తన తల్లి ఖాసీంబీ, సోదరి ఫాతిమాతో కలిసి ఎల్లారెడ్డి నుంచి మెదక్‌ వైపు వెళ్తున్నారు. కారు, ఆటో తాండూర్‌గేట్‌ సమీపంలో ఒకదానికొకటి ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటో నడుపుతున్న హుస్సేన్‌తోపాటు ప్రయాణిస్తున్న ఖాసీంబీ, ఫాతిమా, కారులో ఉన్న మల్లేశంకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న ఆటో

నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని సుల్తాన్‌నగర్‌ గ్రామ శివారులో సోమవారం ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో నలుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. నిజామాబాద్‌ జిల్లా కేంద్రానికి చెందిన మేస్త్రీలు ఆటోలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు బయల్దేరారు. సుల్తాన్‌నగర్‌ శివారులో ఆటో అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు.

ఆటోను ఢీకొన్న బైకు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఆటోను బైక్‌ ఢీకొట్టినట్లు ఎస్సై మహేశ్‌ సోమవారం తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన సాయిలు తన కుటుంబ సభ్యులతో బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డికి ఆటోలో వస్తుండగా విక్రమ్‌ అనే వ్యక్తి బైకును అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ తిమ్మారెడ్డి శివారులో ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో డ్రైవర్‌ సాయిలుకు గాయాలయ్యాయి. సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులకు జరిమానా

బోధన్‌టౌన్‌(బోధన్‌): ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్ల తల్లిదండ్రులకు బోధన్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ శేష తల్పసాయి జరిమానా విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించగా ఐదుగురు బాలురు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారి వివరాలు సేకరించి తల్లిదండ్రులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులతోపాటు తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫేక్‌ కాల్‌ చేసిన ఒకరి రిమాండ్‌

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్‌లో బాంబు పెట్టినట్లు ఫేక్‌ కాల్‌ చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈ నెల 2న రాత్రి 7.41 గంటలకు రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు డయల్‌ 100కు కాల్‌ వచ్చిందన్నారు. వెంటనే డాగ్‌ స్క్వాడ్‌, బీడీ టీం, సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో అన్ని ప్రాంతాలను పరిశీలించి ఫేక్‌ కాల్‌గా గుర్తించామన్నారు. డయల్‌ 100కి కాల్‌ చేసిన వ్యక్తిని రంగారెడ్డి జిల్లా కీసర మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన శ్రీమంత్‌ గౌడ్‌గా గుర్తించి, పట్టుకున్నట్లు తెలిపారు. వ్యక్తిగత సమస్యలుండడంతో ప్రజలను భయాందోళనకు గురిచేసి హింసను ప్రేరేపించాలని దురుద్దేశంతో కాల్‌ చేశానని విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

వామ్మో.. ఎంత పెద్ద పాము



రుద్రూర్‌: మండలంలోని చిక్కడపల్లి గ్రామ శివారులో ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశంలో సోమవారం తాటి జెర్రి పాము ప్రత్యక్షమైంది. పామును చూసిన ఉపాధి కూలీలు భయాందోళనకు గురయ్యారు. హన్మయ్య అనే వ్యక్తి చాకచాక్యంగా పామును చంపివేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పాము పొడవు పది ఫీట్ల వరకు ఉంటుందని ఉపాధి కూలి సాయన్న తెలిపారు.

రేపు కల్తీకల్లు అనర్థాలపై అవగాహన

- 26 మండలాల్లోని 104 గ్రామాల్లో నిర్వహణ
- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయిచైతన్య వెల్లడి

ఖలీల్‌వాడి: కల్తీ కల్లుకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7న అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయిచైతన్య వెల్లడించారు. రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరో డైరెక్టర్‌ ఆదేశాలతో ఆర్‌ఎస్‌సీసీ డీఎస్పీ సోమనాథం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌, సీపీ మాట్లాడుతూ ఈ నెల 7న జిల్లాలోని 26 మండలాల్లోని 104 గ్రామాల్లో కల్తీ కల్లుపై వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కల్తీకల్లు తయారు చేసే వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామన్నారు. కల్తీ కల్లుతోపాటు మాదకద్రవ్య వ్యసనం దాని హానికరమైన ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. మండలానికో ఒక్కో అవగాహన బృందాన్ని ఏర్పాటు చేశామని, బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి మండలంలోని నాలుగు గ్రామాల్లో బృందం పర్యటిస్తుందన్నారు. పీహెచ్‌సీ వైద్యుడు, ఎస్సై, మద్యపాన నిర్మూలన శాఖ సిబ్బంది, గ్రామ కార్యదర్శి మొదలైన వారు కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, స్థానిక సంఘాలతో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. కల్తీ కల్లు, డ్రగ్స్‌కి సంబంధించిన సమాచారం తెలిస్తే టోల్‌ ఫ్రీ నంబర్‌ 1908 కి కాల్‌ చేయాలని ప్రజలను కోరారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్‌

- బంగారం, వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్‌

బాన్సువాడ : బాన్సువాడలో జరిగిన చోరీ కేసులో ఒకరిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ అశోక్‌ తెలిపారు. గత నెల 19న పట్టణంలోని సంగమేశ్వర కాలనీకి చెందిన చెనంగారి లక్ష్మి ఇంటికి తాళం వేసి అత్త సాయవ్వ, ఆడబిడ్డ రాణిలతో కలిసి ఇంటిపైన నిద్రించారు. బోర్లం క్యాంపు తండాకు చెందిన నేనావత్‌ ఈశ్వర్‌ తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారు నగలు, వెండి, నగదును ఎత్తుకెళ్లాడు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని గాంధీచౌక్‌లో ఈశ్వర్‌ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించడంతో తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. నిందితుడి నుంచి 6 తులాల బంగారం, 86 తులాల వెండి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులో చాకచక్యంగా పనిచేసిన కానిస్టేబుల్‌ అశోక్‌ హోంగార్డు హేమాద్రిని సీఐ అభినందించారు.